సాక్షి
నల్లగొండ
శుక్రవారం । 2 । జూన్ । 2023



తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా విద్యుత్ దీపాలతో అలంకరించబడిన నల్లగొండ కలెక్టరేట్

న్యూస్‌రీల్

ప్రజలకు 'గుత్తా' రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు

నల్లగొండ టూటౌన్: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో ప్రజలకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తయి 10వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో ప్రజలంతా భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

6 నుంచి 27 వరకు సదరం క్యాంపులు

నల్లగొండ టౌన్: స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 6వ తేదీ నుంచి 27వ తేదీ వరకు సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థోపెడిక్ శారీరక వైకల్యం కలిగిన వారికి ఈ నెల 6, 8, 13, 15, 20, 22, 27 తేదీల్లో, బుద్ధిమాంద్యం, మానసిక రుగ్మత కలిగిన వారికి ఈ నెల 7వ తేదీన, దృష్టిలోపం కలిగిన వారికి 14న, వినికిడి లోపం కలిగిన వారికి 21వ తేదీన సదరం క్యాంపులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సదరం కార్యాలయంలో నిర్వహించే నిర్ధారణ పరీక్షలకు అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ టౌన్: ధైర్య సాహసాలు కనబరిచిన బాలబాలికల నుంచి జాతీయ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మహిళా, శిశు, వికలాంగ, వయోవృద్ధుల జిల్లా సంక్షేమ అధికారిణి వి.కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులు ఇచ్చేందుకు నేషనల్ అవార్డు ఫర్ బ్రేవరీ జాతీయ అవార్డుకు ఇండియన్ కౌన్సిల్ ఫర్ చైల్డ్ వెల్ఫేర్ న్యూఢిల్లీ వారు దరఖాస్తులను కోరుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని 6 నుంచి 18 సంవత్సరాల వయసు కలిగిన బాలబాలికలు అక్టోబర్ 15వ తేదీలోపున దరఖాస్తులను చేసుకోవాలని, పూర్తి వివరాలకు నల్లగొండలోని సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

9 ఏళ్లలో విశేష ప్రగతి

- ఉమ్మడి నల్లగొండ జిల్లాకు దేశంలోనే గుర్తింపు
- స్వరాష్ట్రం వచ్చాకే సాగర్ కింద రెండు పంటలకు సమృద్ధిగా నీరు
- పంట ఉత్పత్తుల్లో మొదటి స్థానంలో ఉన్నాం..
- విద్య, వైద్య రంగాల్లో వసతులు మెరుగుపరిచాం..
- సంక్షేమంలో ఎన్నో మార్పులు.. జాతీయ స్థాయిలో అవార్డులు
- దండు మల్కాపురంలో దేశంలోనే మొదటి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్

'సాక్షి'తో విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ:

'తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఉమ్మడి నల్లగొండ జిల్లా విశేష ప్రగతి సాధించింది. సాగునీటి, వ్యవసాయ రంగాల్లో అనూహ్యమైన మార్పు వచ్చింది. సాగర్ నుంచి ఒక్క పంటకు కూడా పూర్తి స్థాయిలో సాగునీరు ఇవ్వని పరిస్థితుల నుంచి ఏటా రెండు పంటలకు సాగునీరు అందించే స్థితికి చేరుకున్నాం. పారిశ్రామికంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా కొత్త పుంతలు తొక్కుతోంది. విద్య, వైద్య రంగంలో వసతులు మెరుగుపరిచాం' అని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మంత్రి 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆయన వెల్లడించిన అంశాలు ఇవీ..

ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు జిల్లాలో సంక్షోభంలో కూరుకుపోయిన వ్యవసాయ రంగం తెలంగాణ వచ్చాకే పురోగతిలోకి వచ్చింది. లిఫ్టుల ద్వారా ఎగువ ప్రాంతాలకు నీరందిస్తున్నాం. సాగర్ ద్వారా వరుసగా 16 పంటలకు నీటిని విడుదల చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే. వరి ధాన్యం పండించడంలో మొదటిస్థానానికి చేరుకొని దేశానికే నల్లగొండ జిల్లా ఆదర్శంగా నిలించింది. ఒకప్పుడు జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిస్తే ఇప్పుడు 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తోంది. మిషన్ భగీరథ ద్వారా కృష్ణా జలాలు అందించి ఫ్లోరోసిస్ రక్కసిని తరిమికొట్టాం. గతంలో నల్లగొండ, సూర్యాపేట పట్టణాల్లో వారానికి ఒకసారి నీళ్లు వచ్చేవి. గ్రామాల్లో రెండు మూడు కిలోమీటర్లు నడిచిపోయి నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నుంచి.. ఇంటింటికీ నీరు రోజూ వచ్చేలా అభివృద్ధి చేసుకున్నాం.

● కాళేశ్వరంతో సస్యశ్యామలం

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సూర్యాపేట జిల్లా సస్యశ్యామలమైంది. యాదాద్రి జిల్లాకు కూడా కాళేశ్వరం నీళ్లు అందబోతున్నాయి. సాగర్ లోలెవల్ కెనాల్ ద్వారా 80వేల ఎకరాలకు నీరందుతోంది. వాగులపై ఎక్కడికక్కడ చెక్‌డ్యాంలు నిర్మించాం.

● 24 గంటల విద్యుత్‌తో ఎంతో మేలు

రైతులకు 24 గంటల విద్యుత్‌తో ఎంతో మేలు చేకూరింది. 5 లక్షల బోరుబావులకు ఉచిత విద్యుత్ అందుతోంది. దేశంలోనే అతి పెద్దదైన 4 వేల మెగావాట్ల యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మిస్తున్నాం. యాదాద్రి టెంపుల్‌ను సీఎం కేసీఆర్ నేతృత్వంలో అభివృద్ధి చేశాం. దండుమల్కాపురంలో దేశంలోనే మొదటి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసుకున్నాం.

● మెరుగైన వైద్యం

నల్లగొండ, సూర్యాపేటలో మెడికల్ కాలేజీలు స్థాపించుకున్నాం. వైద్యుల పోస్టులను భర్తీ చేసుకున్నాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ప్రసవాలు చేసే స్థాయికి అభివృద్ధి చేశాం. కిడ్నీ బాధితులు హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా నల్లగొండ, సూర్యాపేట, భువనగిరి, ఆలేరు, హుజూర్‌నగర్, కోదాడ, దేవరకొండ ప్రాంతాల్లో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నాం.

● 73 గురుకుల జూనియర్ కాలేజీలు

విద్యారంగంలోనూ జిల్లా ఎంతో అభివృద్ధి సాధించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు చర్యలు చేపట్టాం. 73 గురుకుల పాఠశాలలను కాలేజీలుగా అభివృద్ధి చేసుకున్నాం. ప్రాథమికవిద్య బలోపేతానికి మన ఊరు మనబడితో స్కూళ్లను అభివృద్ధి చేస్తున్నాం

● సంక్షేమంలో ముందడుగు

జిల్లాలో లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నాం. కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ వంటి వాటి ద్వారా ఎంతో మేలు కలుగుతోంది. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేదలను ఆర్థికంగా ఆదుకుంటున్నాం. ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ద్వారా అంతర్గత రోడ్లు, వైకుంఠ ధామాలు, డంపింగ్‌యార్డులు నిర్మించుకున్నాం. పట్టణాల్లో కూడా రోడ్ల విస్తరణ, వీధిలైట్లు ఏర్పాటు చేసుకున్నాం. తద్వారా దేశ స్థాయిలో అవార్డులు వచ్చాయి.

లక్ష్య సాధనకు ప్రత్యేక శ్రద్ధ

జిల్లాలో ఎగువ ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు ఎత్తిపోతల పథకాలు మంజూరు చేసుకున్నాం. డిండి వంటి వాటి పనులను వేగవంతం చేస్తాం. దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు నీరందించేందుకు ఆయా ఎత్తిపోతల పనులు సత్వరమే పూర్తయ్యేలా చర్యలు చేపడతాం. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో త్వరలోనే ఒక యూనిట్‌ను ప్రారంభించుకుంటాం. కాళేశ్వరం ద్వారా ఈ ఏడాదిలోనే భువనగిరి, ఆలేరుకు సాగునీరందిస్తాం. ఉమ్మడి జిల్లాకు మరిన్ని పరిశ్రమలు తీసుకువచ్చేలా ప్రణాళికలు చేస్తున్నాం. యువతకు ఉపాధి అకాశాలను పెంచుతాం. సూర్యాపేటలో ఐటీ పార్కు తెస్తాం. నల్లగొండలో బత్తాయి మార్కెట్ విస్తరణతోపాటు కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేస్తాం.

నేటి నుంచి దశాబ్ది పండుగ

- కలెక్టరేట్‌లో జాతీయజెండా ఆవిష్కరణతో ఉత్సవాలు ప్రారంభం
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న శాసనమండలి చైర్మన్ గుత్తా
- ముస్తాబైన నీలగిరి పట్టణం



జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

నల్లగొండ: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకొని 10వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా ప్రభుత్వం దశాబ్ది వేడులకు శ్రీకారం చుట్టింది. దీంట్లో భాగంగా శుక్రవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఆ తర్వాత ఉదయాదిత్య భవన్‌లో జరిగే కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తారు. ముందుగా గడియారం సెంటర్‌లో అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పించనున్నారు.

22వ తేదీ వరకు వేడుకలు

శుక్రవారం నుంచి ప్రారంభంకానున్న తెలంగాణ దశాబ్ది వేడుక ఈ నెల 22వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. నల్లగొండను సుందరంగా అలంకరించారు. ప్రధాన రహదారుల వెంట, కూడళ్లలో భారీ ఎత్తున ఆర్చీలను ఏర్పాటు చేసి తోరణాలు కట్టారు. వివిధ ప్రభుత్వ శాఖలు ఏవిధమైన కార్యక్రమాలు నిర్వహించాలనేది జిల్లా కలెక్టర్ ఇప్పటికే తగిన సూచనలు చేశారు. దీంతో తొమ్మిదేళ్ల పాలనలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అవి ప్రజలకు ఏవిధంగా అందాయి వాటిద్వారా ఎంతమందికి లబ్ధిచేకూరింది తదితర విషయాలను ఈ ఉత్సవ కార్యక్రమాల ద్వారా ప్రజలకు తెలియజేయనున్నారు. ఏరోజుకారోజు ఆయా శాఖలు ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజల సహకారంతో కార్యక్రమాలు చేపట్టి సహపంక్తి భోజనాలు చేయనున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి నిర్వహించే రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు మండల కేంద్రాలు, గ్రామాల్లోనూ శుక్రవారం వేడుకలు అట్టహాసంగా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో జరిగే వేడుకలకు రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 8.40 గంటలకు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తారు. ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లో జాతీయ పతాక ఆవిష్కరణ చేస్తారు. ఉదయం 9.10 గంటలకు ముఖ్య అతిథి ప్రసంగం ప్రారంభమవుతుంది. ఉదయం 9.25 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 10 గంటలకు తేనీటి విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వేడుకలకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధి కారులు, వివిధ శాఖల సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని వియవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

గ్రూప్–1 ప్రిలిమినరీకి అన్ని ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ: ఈ నెల 11వ తేదీన నిర్వహించే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, అదనపు ఎస్పీ ప్రసాదరావుతో కలిసి పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 11న జరిగే పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో 51 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఆయా కేంద్రాల్లో మొత్తం 16,095 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా

నవీన ఆస్పత్రి నిర్వాహకులపై వైద్యుల ఫిర్యాదు

మిర్యాలగూడ అర్బన్ : నకిలీ బిల్లులతో తమ సంతకాలు ఫోర్జరీ చేశారని ఆరోపిస్తూ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో గల నవీన మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్వాహకులపై ప్రభుత్వ వైద్యుడు బి.శ్రీనివాస్‌నాయక్, ఎ.జగన్‌రెడ్డి వన్‌టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. త్రిపురారం మండల కేంద్రానికి చెందిన లేకిరెడ్డి సైదిరెడ్డి, పట్టణానికి చెందిన ఆవుల వెంకన్న ఇద్దరు కలిసి నవీన మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్వహిస్తున్నారని, వారు ఆస్పత్రిలో పార్ట్‌ టైం విధులు నిర్వహిస్తున్న వైద్యుల సంతకాలను తెలియకుండా 21 సీఎం సహాయ నిధి దరఖాస్తులపై సంతకాలు ఫోర్జరీ చేసినట్లుగా వారు ఫిర్యాదు చేశారు. ఇటీవల సీఐడీ అధికారులు విచారణ కోసం తమ వద్దకు వచ్చే వరకు మాకు ఆ విషయం తెలియదని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు తెలియకుండా సంతకాలు ఫోర్జరీ చేసిన ఆస్పత్రి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

ఆత్మకూరు(ఎం) : విద్యుదాఘాతంతో ఓ పాడి గేదె మృతి చెందింది. ఈ సంఘటన మండల కేంద్రంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన రైతు మజ్జిగ శ్రీను వ్యవసాయ బావి వద్ద ఈదురుగాలులకు విద్యుత్ వైరు తెగికింద పడ్డాయి. దీంతో పాడిగేదె గడ్డి మేస్తూ తెగిపడిన విద్యుత్ వైరుకు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.60వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. తహసీల్దార్ ఎం.జయమ్మ ఆదేశం మేరకు ఆర్ఐ చిప్పలపెల్లి యాదగిరి పంచనామా నిర్వహించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజశేఖర్

సూర్యాపేట క్రైం : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన పేయింటర్ ఆకారపు శేఖర్(37) బుధవారం రాత్రి ఓ వివాహానికి హాజరయ్యేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఆ సమయంలో అతడు హత్యకు గురయ్యాడు. రోడ్డుపై బీరు సీసాలు పగిలి ఉండటంతో పలు అనుమానాలకు దారితీస్తుంది. వేరే ప్రాంతంలో హత్య చేసి ఎవరైనా ఇక్కడ పడేశారా, లేదా సంఘటనా స్థలంలో హత్య జరిగిందా, ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో పోలీసులు పరిశీలిస్తున్నారు. శేఖర్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ నాగభూషణం, పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు. మృతుడికి భార్య నలుగురు ఆడపిల్లలు ఉన్నారు.

నిందితుడిని శిక్షించాలని రాస్తారోకో



ఆందోళనలో భాగంగా పెట్రోల్ పోసుకునే ప్రయత్నం చేస్తున్న మృతురాలి తల్లి



మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటగిరి

- కోదాడ–జడ్చర్ల ప్రధాన రహదారిపై భారీగా నిలిచిన వాహనాలు
- న్యాయం చేయాలని పెట్రోల్ పోసుకుని కుటుంబ సభ్యుల ఆత్మహత్యాయత్నం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని నాగార్జుననగర్‌లో గల వైష్ణవి అపార్ట్‌మెంట్ పైనుంచి పడి గత నెల 27న దండగల శోభారాణి అనే యువతి మృతి చెందింది. యువతి మృతి చెంది ఆరురోజులు గడిచినా పోలీసులు ఇప్పటికీ నిందితులను గుర్తించకపోవడంతో మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆగ్రహంతో గురువారం పట్టణంలోని కోదాడ–జడ్చర్ల ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. రాస్తారోకో సమయంలో మృతురాలి తల్లితో పాటు సోదరుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆందోళనకారులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా మృతురాలు కుటుంబ సభ్యులు, బంధువులు మాట్లాడుతూ.. అపార్ట్‌మెంట్‌లో 16 సీసీ కెమెరాలు ఉన్నాయని, వాటిని ఎందుకు బయటపెట్టడం లేదని పోలీసులను బంధువులు నిలదీశారు. శోభారాణి మృతికి కారణమైన వ్యక్తులు బయట తిరుగుతున్నారని, అయినా వారి పట్టుకోకుండా తప్పించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మృతురాలికి న్యాయం జరిగేంత వరకు ఆందోళన చేస్తామని రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న వన్ టౌన్, టూ టౌన్ సీఐలు రాఘవేంద్ర, నర్సింహారావులు ఆందోళన వద్దకు వచ్చి విరమించే ప్రయత్నం చేయగా మృతురాలి బంధువులు అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ వెంకటగిరి సంఘటన స్థలం వద్దకు వచ్చి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. అనంతరం డీఎస్పీ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మృతురాలి కుటుంబ సభ్యులను పిలిపించి వారితో మాట్లాడారు. నిందుతులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని వారికి నచ్చజెప్పారు.

501లో ఏం జరిగింది?

పట్టణంలోని వైష్ణవి అపార్టుమెంట్‌లో 501 నంబర్ గల గది గత కొన్ని నెలలుగా ఖాళీగా ఉండటంతో వాచ్‌మెన్ శోభన్ ఆ గదిని తనకు తెలిసిన వారి నుంచి కొంత డబ్బులు తీసుకుని అసాంఘిక కార్యకలాపాల కోసం ఇస్తున్నట్లు తెలిసింది. కాగా గత నెల 27న శోభారాణి అపార్ట్‌మెంట్‌కు 7:45 వచ్చే క్రమంలో స్థానిక సీసీ కెమెరాలో రికార్డు అయింది. అంతే కాకుండా అపార్ట్‌మెంట్ రెండో అంతస్తులో ఉన్న 501 పోర్షన్‌కు వెళ్తున్నట్లుగా సీసీ కెమెరాలో రికార్డు కాగా పోర్షన్‌కు వెళ్లిన 40 నిమిషాల తరువాత శోభారాణి పైనుంచి కింద పడడంతో పలు అనుమానాలకు తావిస్తుంది. వాచ్‌మెన్ శోభన్‌తో పాటు అపార్ట్‌మెంట్‌లోని ఆ పోర్షన్‌కు తరుచు వచ్చే రమేష్‌నాయక్ అనే వ్యక్తిని సైతం అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తే అన్ని విషయాలు బయటకువస్తాయని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికీ రమేష్‌నాయక్ బయట తిరుగుతుండటం, కుమార్, నవీన్ అనే వ్యక్తులనే మాత్రమే పోలీసులు విచారిస్తుండటంతో మృతురాలి బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని మరో రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్‌ది కొంగజపం.. బీజేపీది దొంగజపం

- విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కొంగ జపం చేస్తుండగా, బీజేపీ దొంగ జపం చేస్తోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అటు కాంగ్రెస్, ఇటు బీజేపీలు ప్రజల కోసం కాకుండా అధికారమే పరమావధిగా జపాలకు పూనుకున్నాయని విమర్శించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దశాబ్ది ఉత్సవాలపై బీజేపీ, కాంగ్రెస్‌ల ధోరణిని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. అధికారం కోసం జరుగుతున్న పరుగు పందెంలో బీఆర్ఎస్ పార్టీతో పోటీ పడేందుకే దశాబ్ది ఉత్సవాలను రాజకీయం చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్ర సాధన కోసం జరుగుతున్న ఉద్యమంలో రాజీనామాలు అంటేనే తోక ముడిచిన ఆ రెండు పార్టీలకు దశాబ్ది ఉత్సవాల గురించి మాట్లాడే నైతికత ఎక్కడిదని మంత్రి ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిందే తడవుగా 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంతో సహా 7మండలలాలను ఆంధ్రాలో కలిపిన బీజేపీకి తెలంగాణ గురించి మాట్లాడే హక్కు ఎక్కడిదన్నారు. ఏడు దశాబ్దాలుగా తెలంగాణను అంధకారంలోకి నెట్టిన కాంగ్రెస్ పార్టీ దశాబ్ది ఉత్సవాల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. తొమ్మిదేళ్లలో ఊహకు మించిన అభివృద్ధిని సాధించుకున్నందునే దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. దశాబ్ది ఉత్సవాలను బీఆర్ఎస్ శ్రేణులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

యాదాద్రిలో బ్రాహ్మణ సమాఖ్య సభ్యుల పూజలు



ఆలయాన్ని సందర్శించిన అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు గురువారం దర్శించుకున్నారు. వారికి ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దోర్బల భాస్కర్‌శర్మ, ఇతర అధికారులు, ఆచార్యులు స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకొని, సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద అష్టోత్తర పూజలో పాల్గొన్నారు. శ్రీస్వామిని దర్శించుకున్న వారికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. బుధవారం గోపన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన బ్రాహ్మణ పరిషత్ భవన ప్రారంభోత్సవంలో పాల్గొని గురువారం సీఎం కేసీఆర్ ఆహ్వానం మేరకు యాదాద్రీశుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కేరళ రాష్ట్రానికి చెందిన అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ ప్రదీప్ జియోతి మాట్లాడుతూ.. బ్రాహ్మణ సమాజం కోసం ప్రత్యేకంగా అద్భుతమైన భవనాన్ని నిర్మించినందుకు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కొన్నేళ్ల క్రితం తాను సందర్శించిన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం పూర్తిగా రూపాంతరం చెందిందన్నారు. యాదాద్రి ఆలయాన్ని ముఖ్యమంత్రి పునర్నిర్మాణం చేయడంతో ఇప్పుడు దేశం నలుమూలల నుంచి యాత్రికులను ఆకర్షిస్తుందని ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ పండిట్ పదం ప్రకాష్ (ఉత్తరాఖండ్) ప్రశంసించారు. ఆలిండియా బ్రాహ్మణ సమాఖ్య ముఖ్య సలహాదారు డాక్టర్ భగవాన్ శర్మ (ఉత్తరప్రదేశ్) మాట్లాడుతూ.. తెలంగాణ ముఖ్యమంత్రి బ్రాహ్మణ సమాజం కోసం ప్రత్యేకంగా ఆరు ఎకరాల విస్తీర్ణంలో బ్రాహ్మణ భవన్ నిర్మించాలనే భావనను ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఆలయ నిర్మాణ పనులు, ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దిన శిల్పులను వారు కొనియాడారు. వారి వెంట తెలంగాణ బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు జగన్మోహన్ శర్మ, ఇతర బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు శ్రీస్వామిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



నారాయణరెడ్డి (ఫైల్)

పెద్దవూర : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని మల్లికార్జున ఫంక్షన్ హాల్ యజమాని మల్‌రెడ్డి నారాయణరెడ్డి(46) గురువారం మిర్యాలగూడెంలో నిర్వహించిన వేలంలో పాల్గొని ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశాడు. కొనుగోలు చేసిన బైక్‌ను తీసుకుని సాయంత్రం తన ఇంటికి బయలుదేరాడు. మండల కేంద్రంలోని జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై చౌరస్తా సమీపంలోని పాత ఇనుప సామాను కొట్టు ముందుకు రాగానే ఆగి ఉన్న ఇసుక లారీని వెనకనుంచి ఢీకొట్టాడు. దీంతో అతడు రోడ్డుపై పడటంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ఇంటికి ప్రమాదం జరిగిన ప్రదేశానికి రెండు వందల మీటర్ల దూరం ఉంటుంది. కాగా లారీలో డీజిల్ అయిపోవడంతో మధ్యాహ్నం నుంచి లారీ రోడ్డు పక్కన నిలిచి ఉంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు వాసుదేవుల సత్యనారాయణరెడ్డి, కర్ణ బ్రహ్మారెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

నార్కట్‌పల్లి : జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని నార్కట్‌పల్లి కామినేని అస్పత్రి సమీపంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి మండలం నామవరం గ్రామానికి చెందిన ఆకెళ్ల లక్ష్మీకళ్యాణి (48) తన స్వంత కారులో కుటుంబ సభ్యులతో కలసి హైదరాబాద్ నుంచి తన స్వంత గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో నార్కట్‌పల్లిలోని కామినేని అస్పత్రి సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి ముందుగా వెళ్లే గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న లక్ష్మీకళ్యాణి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కూతురు రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

వ్యక్తికి గాయాలు

నాగారం : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని ఫణిగిరి శివారులో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన రావుల శంకరయ్య తన వ్యవసాయ పనుల నిమిత్తం ఎద్దుల బండిపై ఫణిగిరి నుంచి పొలానికి తిరుమలగిరి వైపు వెళుతున్నాడు. అదే సమయంలో విజయవాడకు చెందిన గంజి నరేంద్ర అనే వ్యక్తి బొలేరోలో విజయవాడ నుంచి తిరుమలగిరి వైపుకు వెళ్తున్న క్రమంలో ఫణిగిరి శివారులోని సీఎస్ఐ చర్చీ ఎదుట ఎద్దుల బండిని వెనుక నుంచి అతివేగంగా బొలేరో వాహనంతో ఢీకొట్టాడు. దీంతో ఎద్దుల బండి నడుపుతున్న శంకరయ్య బండిపై నుంచి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కుమారుడు ఉదయ్ ఫిర్యాదు మేరకు బొలేరో వాహనదారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.ముత్తయ్య తెలిపారు.

డీసీఎం ఢీకొని వ్యక్తి దుర్మరణం



అన్వేష్ (ఫైల్)

అర్వపల్లి : బైక్‌ను డీసీఎం ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లికి చెందిన ఈద అన్వేష్(21), సాయిని లక్ష్మణ్, కాసర్లపహాడ్‌కు చెందిన కోరివి శ్రవణ్ ముగ్గురు రామన్నగూడెం శివార్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌కు పెళ్లికి వెళ్లి గురువారం రాత్రి తిరిగి బైక్ పై ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో సూర్యాపేట వైపు నుంచి అర్వపల్లి వైపు వస్తున్న డీసీఎం వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో అన్వేష్(21)అక్కడికక్కడే మృతి చెందగా, లక్ష్మణ్, శ్రవణ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108లో సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా అన్వేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.అంజిరెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ తాపీ మేస్త్రీ మృతి

చిట్యాల : ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ తాపీ మేస్త్రీ మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. మండల కేంద్రానికి చెందిన మీసాల ఊషయ్య (57) బుధవారం ముత్యాలమ్మగూడెం ప్రాంతంలో ఓ ఇంటి నిర్మాణంలో పనిచేస్తుండగా పైఅంతస్తులో ఉన్న మెట్లపై నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో మేస్త్రీ తలకు తీవ్ర గాయాలుకావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఊషయ్య మృతి పట్ల భవన నిర్మాణ కార్మికులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

పరిహారం పెంచాలని రైతుల ఆందోళన



అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు

చింతపల్లి : డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా మండల కేంద్రంలో నిర్మించనున్న చింతపల్లి రిజర్వాయర్‌తో భూములు కోల్పోతున్న తమకు పరిహారం పెంచాలని డిమాండ్ చేస్తు గురువారం మండల కేంద్రంలో పలువురు రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. ప్రభుత్వం 2012లో మండల కేంద్రంలో ప్రాజెక్టు నిర్మించేందుకు నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. కొంత మంది రైతులు భూమిని ఇచ్చేందుకు అంగీకరించగా వారి నుంచి ఒప్పంద పత్రాలు తీసుకొని ఏడేళ్లు గడుస్తున్నా నేటికీ పరిహారం అందించకపోగా గురువారం మళ్లీ నూతన నోటిఫికేషన్ అంటూ సమావేశం పెట్టడం ఏంటని ప్రశ్నించారు. మండల కేంద్రంలో ఎకరం భూమి కోట్లాది రూపాయలు పలుకుతుండగా రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.5.50లక్షలకే ఇవ్వాలని నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదన్నారు. సమావేశంలో నీటిపారుదల శాఖ డీఈతో పాటు స్థానిక తహసీల్దార్ విశాలాక్షి మాట్లాడకుండా రైతులు అడ్డుకొని నిరసన తెలిపారు. ఈ క్రమంలో అధికారులతో వాగ్వాదానికి దిగారు. పరిహారం పెంచితేనే తమ భూములు ఇస్తామని వారు తేల్చిచెప్పారు. కార్యక్రమంలో రైతులు వెంకట్‌రెడ్డి, ఎల్లంకి అశోక్, చంద్రారెడ్డి, స్థానిక సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి, ఆవుల సత్తయ్య, ఎల్లంకి కృష్ణయ్య, ఆకుల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో మహిళ మృతి

కోదాడరూరల్ : మండల పరిధిలోని చిమిర్యాలకు చెందిన కొండ పుల్లమ్మ (41) వడదెబ్బకు గురై గురువారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్లమ్మ మూడు రోజుల కిందట ఉపాధిహామీ పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత వడదెబ్బకు గురికావడంతో కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

గీత కార్మికుడికి గాయాలు



తాటిచెట్టు పైనుంచి పడిన బత్తిని రామలింగయ్య

నిడమనూరు : మండలంలోని ఊట్కూర్ గ్రామానికి చెందిన బత్తిని రామలింగయ్య తాటిచెట్టు పైనుంచి కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం ఉదయం రామలింగయ్య కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కగా అదే సమయంలో నడుముకు ఉన్న మోకు జారడంతో కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు గమనించి చికిత్స కోసం నల్లగొండకు తరలించారు.

గీత కార్మికుడి మృతిపై విచారణ

కోదాడరూరల్ : మండల పరిధిలోని తొగర్రాయికి చెందిన గీత కార్మికుడు వట్టికూటి శ్రీను ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. దీంతో అతడి ఎక్స్‌గ్రేషియా మంజూరుకు సంబంధించిన వివరాలను ఎక్సైజ్ సీఐ రాజేశ్వరి, కౌండిన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్‌తో కలిసి విచారణ చేసి నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించి ఎక్స్‌గ్రేషియా మంజూరుకు తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బాలేబోయిన చిన్నవేలాద్రి, వట్టికూటి వెంకన్న, యడవల్లి నాగరాజు, వీరబాబు, నరసింహారావు, నాగరాజు, నరహరి ఉన్నారు.

వైభవంగా స్వాతీ నక్షత్ర కల్యాణం

మఠంపల్లి : సూర్యాపేట జిల్లా మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వాతీనక్షత్ర కల్యాణ వేడుకలు గురువారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, పంచామృతాభిషేకం జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదే విధంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచ గవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ గావించారు. అదేవిధంగా శ్రీస్వామిఅమ్మవార్లను ఆలయ తిరుమాఢ వీధుల్లో గరుడవాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, చెన్నూరు మట్టపల్లిరావు, ఈట నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలకు ముస్తాబు



విద్యుత్ వెలుగుల్లో నల్లగొండ మున్సిపల్ కార్యాలయం



సూర్యాపేటలోని కొత్త బస్టాండ్ చౌరస్తా



నల్లగొండ జెడ్పీ కార్యాలయం



భువనగిరి మండలం చందుపట్ల అంగన్‌వాడీ కేంద్రంలో వరినారుతో ఏర్పాటు చేసిన తెలంగాణ ఫార్మేషన్ డే అక్షరాల ఆకారం



సూర్యాపేట మున్సిపల్ కార్యాలయం



దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నల్లగొండలో ఏర్పాటు చేసి ఆర్చి



విద్యుత్ వెలుగుల్లో భువనగిరి పోలీస్ పరేడ్ గ్రౌండ్